జిల్లాలో పీఎం సూర్యఘర్ (ఇంటింటికి సోలార్ పథకం) విజయవంతమయ్యేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 70 వేల మంది వినియోగదారులకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. కానీ జిల్లాలో పరిస్థితి చూస్తే ఇప్పటికి ఒక్కశాతం కూడా నమోదు కాని దయనీయ స్థితి నెలకొంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్చరించినా అధికారుల్లో చలనం లేనట్లు ఉంది. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు వెనకబడ్డారనేది ఒకటైతే, వినియోగదారుల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవడం మరో సమస్య. దీంతో సూర్యఘర్ పథకం ముందుకు సాగడం లేదు.

వెలగనంటోన్న సోలార్..



- అటకెక్కిన ప్రభుత్వ లక్ష్యం
- అవగాహన కల్పించడంలో చేతులెత్తేసిన ట్రాన్స్‌కో అధికారులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి హెచ్చరించినా ముందుకు సాగని పీఎం సూర్యఘర్

పులివెందుల, మే 11 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో ఆయా ఇంటి వినియోగదారులకు విద్యుత్ అందించాలని ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ (ప్రధానమంత్రి ఇంటింటికి సోలార్ వెలుగు) అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇంటింటికి సోలార్ వెలుగులు అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని, మిగిలిన వారికి కిలో వాట్‌కు రూ.30 వేలు, రెడు కిలో వాట్‌లకు రూ.60వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.70 వేలు ఇలా సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మూడు కిలోవాట్‌కు తీసుకుంటే రూ.20 వేలు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 70 వేల ఇళ్లపైన సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. కానీ ఈ లక్ష్యం కాదు కదా కనీసం పది నుంచి ఇరవై శాతం కూడా పూర్తయ్యే పరిస్థితులు వినియోగదారుల్లో కనిపించడం లేదు. ఇందుకు కారణం వినియోగదారుల ప్రశ్నలకు అధికారుల వద్ద సరైన సమాధానం లేకపోవడం... ఒకేసారి మూడు కిలోవాట్లకు రూ.1.30 లక్షలు ఈ సోలార్ సిస్టంకు ఖర్చు చేయాల్సి ఉండడంతో వినియోగదారుల్లో ఆసక్తి కనిపించడం లేదు. కానీ ఇటీవల పులివెందులలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో 10 వేల ఇళ్లపైన సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉందని, ఇందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నించారు. అధికారులు చెప్పిన సమాధానానికి మంత్రి మండిపడ్డారు. అవగాహన కల్పించడంలో ట్రాన్స్‌కో పూర్తిగా వెనుకబడిందని, ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలని మంత్రి వారికి వివరించారు.

వినియోగదారుల్లో అనుమానాలు

పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవడానికి వివిధ కంపెనీలు పలు ధరలు ప్రకటించాయి. అందులో ఓ కంపెనీ వివరాలు పరిశీలిస్తే రూ.2,06,400 మూడు కిలోవాట్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ ప్రకటిస్తోంది. ఈ పూర్తి మొత్తం వినియోగదారులు చెల్లించాలి. చెల్లించిన అనంతరం ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీని మంజూరు చేస్తోంది. అంటే రూ.1,28,400 వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి నెల వినియోగదారులకు విద్యుత్ బిల్లు రూ.వెయ్యి నుంచి రూ.1500 వస్తున్నప్పటికి ఇంతమొత్తం ఒకేసారి చెల్లించేందుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. ఈ సమస్య ఒకటైతే కొంత ఆసక్తి ఉన్న వినియోగదారులు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయనే అనుమానాలతో సోలార్ సిస్టం ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. అందులో సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్న అనంతరం ఏదైనా మరమ్మతులు సంభవిస్తే ఏర్పాటు చేసిన సంస్థ అందుబాటులో ఉండదని, వారు సరిగా సర్వీస్ ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటని నేరుగా అధికారులను లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే అవి పూర్తి స్థాయిలో పనిచేయకుంటే ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ యూనిట్లు, ఇంటి అవసరాలకు ఉపయోగించుకున్న యూనిట్లు పోల్చి మిగిలిన డబ్బు ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నా, వినియోగదారులకు కలిగే పలు సందేహాలతో సోలార్ పథకం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది.

ఒక్కశాతానికీ మించలేదు..

ప్రభుత్వం పెట్టుకున్న దాదాపు 70 వేల వినియోగదారులకు సోలార్ సిస్టం అందించాలని లక్ష్యం పెట్టుకుంది. కానీ ఈ లక్ష్యం చేరే పరిస్థితులు కనిపించడం లేదు. దాదాపు ఇప్పటికి జిల్లాలో 500 మంది వినియోగదారులు కూడా సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోలేదంటే వినియోగదారుల్లో ఈ సిస్టంపై ఏ మేర ఏర్పాటుకు ముందుకొస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. పులివెందుల నియోజకవర్గంలో ఇప్పటి వరకు 48 మంది వినియోగదారులు సోలార్ సిస్టం కావాలని దరఖాస్తు చేసుకున్నారు. అందులో 41 మంది ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చారు. అందులో 27 మంది వినియోగదారులు మాత్రమే వారి ఇళ్లపైన సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్నారు. అంటే సోలార్ సిస్టంపైన ప్రజలకు ఆసక్తి లేదని తెలుస్తోంది. వందల్లో వచ్చే కరెంటు బిల్లుల కోసం లక్షలు ఖర్చు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితం

జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఇంటింటికి సోలార్ పథకం ఉచితంగా ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఎంతమంది వినియోగదారులు ఉన్నారని వివరాలు సేకరించింది. పులివెందుల నియోజకర్గంలో 11,600 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులుగా ఉన్నారు. అందులో రెండు మీటర్లు కలిగిన వారిని మినహాయిస్తే 9500 మంది వనియోగదారులకు సోలార్ సిస్టం పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందించనుంది. ఈ 9500 మంది ఇళ్లపైన సోలార్ ప్యానల్లు ఏర్పాటు చేసేందుకు తగిన స్థలం లేకపోవడంతో ప్రభుత్వానికి సమస్య ఉత్పన్నమైంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కాలనీల సమీపంలో ఓ స్థలంలో ఏర్పాటు చేసి ఆయా ఇళ్లకు సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు ఓ అధికారి తెలిపారు.



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి సవిత (ఫైల్)

సోలార్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం

వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారికి ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేస్తున్నాం. ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీలు 3 కిలోవాట్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే వారికి అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బీసీలకు మాత్రం రూ.98 వేలు సబ్సిడీ వస్తుంది. కానీ సిస్టం ఏర్పాటు చేసుకున్న అనంతరం మరమ్మతులకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని వినియోగదారుల్లో అనుమానాలు ఉన్నాయి.

- ప్రసాదరెడ్డి, డీఈ, పులివెందుల

పుష్కరిణిలో స్వామి విహారం



తెప్పోత్సవంలో వెంకటేశ్వరస్వామి

కడప కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు దేవునికడపలోని పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున పుష్కరిణి వద్దకు హాజరై స్వామి అమ్మవార్లను కనులారా వీక్షించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు క్రిష్ణమోహన్, రఘునందన్, తరుణ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని పుష్కరిణిలో ఊరేగించారు.

1100ను సద్వినియోగం చేసుకోండి

- డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్‌సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు పై నెంబరుకు కాల్ చేయవచ్చన్నారు.

నేడు సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహిస్తున్నామని డీఆర్వో పేర్కొన్నారు. అర్జీదారులు ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయిల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతుందని, 08562-244437కు ఫోన్‌చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో కోరారు.

దస్తగిరిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు



దస్తగిరి ఇంటి వద్ద పలువురిని విచారిస్తున్న ఎస్ఐ నారాయణ

పులివెందుల, మే 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరిని మస్తాన్ అనే వ్యక్తి బెదిరించారని ఫిర్యాదు అందడంతో పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... రెండు రోజుల క్రితం దస్తగిరి కుమార్తెతో పక్కింటి మస్తాన్ భార్య కావేరి ప్రేమ వివాహ విషయమై చర్చించింది. దీంతో ఆ యువతి తన తండ్రి దస్తగిరికి విషయం తెలియజేసింది. వెంటనే అతను వెళ్లి ప్రేమ వివాహాల గురించి చిన్నపిల్లలతో ఎందుకు మాట్లాడారని మస్తాన్ భార్యను వారించాడు. ఆ సమయంలో మస్తాన్ ఇంట్లో లేడు. అనంతరం శనివారం రాత్రి మస్తాన్, కౌన్సిలర్ రాజశేఖర్ ప్రోద్బలంతో 20 మందితో కలిసి వచ్చి తాను లేని సమయంలో తన భార్యతో ఎందుకు మాట్లాడావని ప్రశ్నించాడు. మళ్లీ ఇలాంటివి పునరావృతమైతే పరిస్థితులు వేరేలా ఉంటాయని బెదిరించాడు. దీంతో దస్తగిరి శనివారం రాత్రి జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎస్ఐ నారాయణ దస్తగిరి ఇంటి చుట్టుపక్కల వారిని విచారించి కేసు నమోదు చేశామని తెలపారు.

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



7

నేటి నుంచి అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు



ఉత్సవాల సందర్భంగా అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

రాజంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు, అన్నమాచార్యుల ప్రాజెక్టు సంచాలకులు కె.రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. తాళ్లపాక గ్రామంలోని ధ్యానమందిరం, అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక ముఖద్వారం వద్ద ఉన్న 108 అడుగుల విగ్రహం వద్ద, తిరుపతి మహతి ఆడిటోరియం, అన్నమాచార్యుల కళామందిరం వద్ద ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు తాళ్లపాక గ్రామంలోని అన్నమాచార్య ధ్యానమందిరం ఆవరణంలో శ్రీనివాస కల్యాణం జరగనుంది. ఇదేరోజు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి ఊంజల సేవ కార్యక్రమం జరగనుంది. 7.30 గంటలకు తిరుపతికి చెందిన కౌసల్య బృందంచే హరికథ, 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన ఆర్.శ్యామ్‌కుమార్, హేమమాలిని బృందంచే సంగీత సభ, 7 గంటలకు అన్నమయ్య సేవా సంస్కృతి బృందంచే నృత్యం జరగనుంది. 14న సాయంత్రం సంగీతసభ, కోదండరామ కళా నాట్యమండలిచే నాటకం ఉంది. తాళ్లపాక ధ్యానమందిరం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే గోష్ఠిగానం, సప్తగిరి సంకీర్తనలు ఉంటాయి. ఉదయం 10.30 గంటలకు శ్రీనివాస కల్యాణం జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు సంగీతసభ, హరికథ కార్యక్రమం ఉంటుంది.

రెండేళ్లుగా ఎదురుచూపు

- జీవో ఇచ్చి పరిహారాన్ని గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే గండికోట నిర్వాసితుల ఆశలు



గండికోట ప్రాజెక్టు వద్ద నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు (ఫైల్‌ఫొటో)

కొండాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. గత ప్రభుత్వం సమస్యలు గాలికొదిలేయడంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇక ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ సర్కారు పరిహారం కోసం జీవో విడుదల చేసినా, ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.

రూ.454 కోట్ల పరిహారం ఉత్తుత్తిదేనా ?

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 6 జూలై 2023న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు గానూ రూ.295.62 కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటి విడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు ఆ జీవోలో పేర్కొంది. ఈ జీవోకు సంబంధించి కనీసం ఒక్కరూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది.

వైసీపీ సర్కారు జీవో విడుదల చేసి గాలికొదిలేయడంతో కూటమి ప్రభుత్వంపైనే నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది డిసెంబరు 22న మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించడంతో పరిహారంపై నిర్వాసితులు మరింత ఆశలు పెంచుకున్నారు. ఈ సందర్భంగా పరిహారం తొందరగా ఇచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి చెప్పారు. ఆ తర్వాత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి విజయవాడలో నిర్వాసితులు మంత్రి నిమ్మలతో సమావేశమయ్యారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.150 కోట్ల నిధులతో పాటు, మిగిలిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రూ.150 కోట్లను వెంటనే విడుదల చేస్తామని, ఆ తర్వాత విడతల వారీగా పరిహారాన్ని అందజేస్తామని మంత్రి చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పరిహారానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.



అశ్రునయనాల మధ్య జడ్పీ మాజీ చైర్మన్ అంత్యక్రియలు

- తులసిరెడ్డి, సినీనటుడు రాజ్‌కుమార్‌తో పాటు పలువురు హాజరు



సీఎం బలరామిరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, సినీనటుడు రాజ్‌కుమార్ తదితరులు

కొండాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): అశ్రునయనాల మధ్య ఉమ్మడి కడప జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి అంత్యక్రియలను ఆదివారం కొండాపురంలో నిర్వహించారు. ఆయన అల్లుడు సినీనటుడు రాజ్‌కుమార్, కుమార్తె రమాదేవి ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రెడ్డి తులసిరెడ్డి ఆయన భౌతికకాయానికి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో ఉన్నప్పుడు బలరామిరెడ్డితో తనకు మంచి సాన్నిహిత్యం ఉండేదని, రెండుసార్లు ఉమ్మడి కడప జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా ఉన్న ఏకైక వ్యక్తి బలరామిరెడ్డి అని కొనియాడారు. ఆయన రాజకీయ అజాతశత్రువని, నిగర్వి, విద్యావంతుడని ఆయనతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తులసిరెడ్డితో పాటు టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి, పులివెందుల, జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ధ్రువకుమార్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు మిట్టా పుల్లారెడ్డి తదితరులు బలరామిరెడ్డి భౌతికకాయానికి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం పట్ల పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రామకేవవ, ప్రకాష్‌బబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద...

కడప సెవెన్ రోడ్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ పేర్కొన్నారు. నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారంకోసం నగరపాలక కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలన్నారు.

కార్పొరేట్ లాభాలకోసమే తెరపైకి 4 లేబర్ కోడ్లు

సదస్సులో కార్మిక సంఘాల ప్రతినిధులు



కడప మారుతీనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ కార్మికవర్గాన్ని, యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు కావాలనే తెరపైకి నాలుగు లేబర్ కోడ్లను ప్రభుత్వం తెచ్చిందని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు విమర్శించారు. వీటి వలన కార్పొరేట్ల లాభాలు పెరిగి కార్మికులు ఏ హక్కులూ లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మికవ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు కేంద్ర కార్మికసంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కార్మికసంఘాల సారథ్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్. నాగసుబ్బారెడ్డి, సీఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాసులురెడ్డి, బీ. మనోహర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, రైతు సంఘాల నాయకులు సుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, ఎల్ఐసీ యూనియన్ నాయకలు రఘునాథరెడ్డి, సీఐటీయూ నాయకురాలు లక్ష్మీదేవి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్మికసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..

ఘనంగా మాఊళ్లమ్మకు బోనాలు



మావూళ్లమ్మకు పూజలు చేస్తున్న బీటెక్ రవి

చక్రాయపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె మావూళ్లమ్మ బోనాలు సందర్భంగా ఆదివారం పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, చక్రాయపేట మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం మావూళ్లమ్మ ను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం నారపురెడ్డిగారిపల్లెల, టీడీపీ నాయకులు బాలే రామాంజనేయ రెడ్డితో మాట్లాడారు. టీడీపీనాయకులు, కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మామిడి, సన్ననిమ్మ, చీనీ చెట్లు గాలివానకు నేలవాలడంతో నష్టపోయిన రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా న్యాయం చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మాంచాలమ్మ తల్లికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చదిపిరాళ్ల, గొల్లపల్లె గ్రామాల మధ్యన ఉన్న మాంచాలమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లపల్లె చదిపిరాళ్ల గ్రామాలే కాకుండా మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండురోజులుగా జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. మధ్యాహ్నం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల కన్వీనరు రాఘవరెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, మల్లేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, శంకర్‌రెడ్డ, బీమారెడ్డి, రెడ్డికరీం, అనంతరెడ్డి, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

తెగుళ్లు,చీడలతో మిరప రైతు కంట కన్నీరు

●అధిక పెట్టుబడులతో ఆశించిన దిగుబడులు రాక కుదేలవుతున్న రైతన్నలు

పెండ్లిమర్రి, మే 11 (ఆంధ్రజ్యోతి):ఎర్ర బంగారంగా పిలిచే మిరప పంట సాగు రైతులకు తెగుళ్ల, చీడలతో పంట దిగుబడులు పడిపోగా పెరిగిన పంట సాగు పెట్టుబడి,మార్కెట్లో ధర లేక పోవడంతో మిరప ఘాటుకు రైతు కంట కన్నీరు కారుతోంది.మండలంలో మిరపను వ్యవసాయ బోరుబావుల క్రింద వాణిజ్య పంటగా సాగుచేస్తారు.ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నాగాయపల్లె, బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లె, తిప్పరాజుపల్లె గ్రామాలలో ప్రధానమైన పంటగా మిరపను సాగుచేస్తారు.

సాగుభారం...: ఎకరా పొలంలో మిరప పంటను సాగు చేయాల ంటే ఒక లక్ష రూపాయలు ఖర్చు అవుతు ంది.మొక్కలు కొనడంతో మొదలు పెడితే వ్యసాయ ఖర్చులు,ఎరువులు, పురుగుల మందులు,కలుపు తీయడం, పంట కోతకు వస్తే ఆ ఖర్చులు అదనం.వాతావరణ మార్పులు,పంట మార్పిడి లేక పోవడం,తెగుళ్ళు,ఆకుముడత తెగులు,రెడ్ మేట్,ఎల్లో మేట్,ఎండతెగులు,నల్లకొమ్మ తెగులు పంటకు ఆశించి పంట దిగుబడి గణనీయంగా తగ్గి పోయింది.ప్రతికూల వాతావరణ ప్రభావంతో మొక్క నాటినప్పటి నుంచి అధిక పెట్టుబడులతో ఆశించిన దిగుబడులు రాకా రైతన్నలు కుదేలవుతున్నారు.

సరైన మార్కెటింగ్ సదుపాయాలు కరువు..: సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేక విజయవాడ,ఖమ్మం,కరీంనగర్,వరంగల్ తదితర పట్టణాలకు రైతులు సొంతంగానే తరలిస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న మార్కెట్లకు తరలించాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు గురవుతున్నారు.దళారులకు విక్రయిస్తామంటే మార్కెట్ రేటు కంటే 2-3 వేలు తక్కువకు అడుగుతున్నారు.

తెగుళ్లు దెబ్బతీశాయి



తెగుళ్ల సోకి ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయింది.ధరలు లేక పోవడంతో సాగు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనబడటం లేదు.

మహేశ్వర్ రెడ్డి, రైతు నాగాయపల్లె

మిర్చిపంట సాగుతో నష్టాలే



ఈ ఏడాది 5 ఎకరాల్లో మిరపను సాగు చేశాను.పంట వేసిన దగ్గర నుంచి తెగుళ్ళు చీడలతో పంట దిగుబడి తగ్గి కూలీల ఖర్చులు పెరిగాయి. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంట గిట్టుబాటు కాలేదు.దీంతో ప్రతా ఏడాది నష్టాలే మిగులుతున్నాయి.

శ్రీనివాస రెడ్డి, రైతు, నల్లయ్యగారిపల్లె



మిరప పంట

నేడు పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

కడప కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజను అలంఖాన్‌పల్లెలో వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవం జరగనుందని ఆలయ భక్త బృందం తెలిపారు. కళ్యాణ మహోత్సవానికి ముందుగా తెల్లవారుజామున 5గంటలకు స్వామి అమ్మవార్లకు అభిషేకం, తదుపరి 8గంటలకు కల్యాణ మహోత్సవం జరగనుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ జరగనుందన్నారు.

నేటి మొలకల పౌర్ణమికి ఏర్పాట్లు



సింహాద్రిపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): మొలకల పౌర్ణమి పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు తెలిపారు. సోమవారం మండలంలోని సింహాద్రిపురం, గురిజాల, బిదినం చెర్ల, చెర్లోపల్లి గ్రామాల్లో ఘనంగా మొలకల పౌర్ణమి నిర్వహించేందుకు ఆయా గ్రామస్థులు ధాన్యం మొలకల కుండీలను ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఈ యేడు పాడి పంటలు సంమృద్ధిగా ఉండాలని రైతులు దేవుళ్లను కోరుకుంటూ చేసుకునే పండుగే మొలకల పౌర్ణమి.

ఆత్మాశ్రయ ధోరణితో రాసిన శతకాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

కడప కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నిరూపమానమైన భగవంతుని లీలను స్తుతిస్తూ ఆత్మాశ్రయ ధోరణితో కంభం పుల్లారెడ్డి శతకాలను రాశారని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక దిగువ కొత్తపల్లిలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కంభం పుల్లారెడ్డి రచించిన శ్రీ నృసింహశతకం, తిరుమల రాయశతకం, రాయలసీమ రైతన్న శతకం, రాజన్న శతకాలను సంస్థ అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా రచయిత సంఘం పుల్లారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో కంభం బాలిరెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి, వై.శివారెడ్డి, కందుల సుబ్బారెడ్డి, కె. నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

భారత త్రివిధ దళాల సైనికులు క్షేమంగా ఉండాలి



గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప మారుతీనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత త్రివిధ దళాల సైనికులు సరిహద్దుల్లో క్షేమంగా ఉండాలని బీజేపీ, బీజేవైయం నాయకులుప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం స్థానిక 9వ డివిజను ఎన్జీవో కాలనీలో గల గంగమ్మ తల్లి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేవైయం రాష్ట్ర నాయకుడు బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీజేపీ నాయకుడు సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, జిల్లాఉపాధ్యక్షుడు ప్రవీణ్‌నాయుడు, కార్యదర్శి ఓబులయ్య, ఆలయ వ్యవస్థాపకుడు కంభగిరిగౌరీశంకర్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల కల్యాణం

లింగాల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల దేవర కోనలో వరదరాజుల స్వామి గర్భగుడిపైన శ్రీవారి గోవిందనామాల ఆకృతులను ఆదివారం ఏర్పాటుచేశారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి కల్యాణం నిర్వహించ నున్నారు. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి రోజున దేవరకోనలో తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా భక్తులు, దాతలు అందించిన సుమారు రూ.4లక్షల విరాళాలతో గోవిందనామం, శంఖం, శ్రీచక్రం ఆకృతులను ఏర్పాటుచేసి వాటికి ఎల్‌ఈడీ బల్బులు అమర్చడంతో ఆలయం వద్ద కొత్త శోభ సంతరించుకుంది. మంగళవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు.

ఘనంగా నరసింహస్వామి జయంత్యుత్సవాలు

కమలాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో రోజు అరుణ పారాయణ దీక్ష హోమాలు, మండప పూజలు విశేషంగా జరిగాయి. కాగా ప్రతిరోజూ అన్నదాన సేవా కార్యక్రమం జరుగుతుంది.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్వాతి నక్షత్రం సందర్భంగా ఆదివారం సింహాద్రిపురంలో వెలసిన లక్ష్మీనరసింహస్వావి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణ అనంతరం మహామంగళ హారతినిచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయనిర్మాణానికి భూమిపూజ



కడప కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): నగర చిన్నచౌక్ పరిధిలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ జీర్ణోద్ధరణ పనులలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9-30 గంటల మధ్య వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఘనంగా భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ముహూర్త సమయానికి దేవదాయ, ధర్మాదాయ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ జనార్దన్ హాజరయ్యారు. కాగా భూమి పూజా కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహస్వామి జయంతి ఉత్సవాలు



నరసింహ జయంతి గ్రామోత్సవంలో కోలాటం

వల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : నారసింహ జయంతి సందర్భంగా మండల పరిధిలోని పలు నారసింహాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అందులో భాగంగా దిగువపల్లి గ్రామంలో కొలువైన నరసింహ ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వైభవంగా లక్ష్మీనరసింహ కల్యాణాన్ని కనుల పండుగ నిర్వహించారు. అలాగే మండల కేంద్రమైన వల్లూరు తూర్పు పడమటి వీధిలో నరసింహ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ పడమటి నరసింహ స్వామి మేళతాళాలతో కోలాటాల మధ్య బ్రహ్మోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని కార్య నిర్వాహకులు అందించారు.

హనుమత్‌వాహన సేవలో లక్ష్మీ నృసింహస్వామి

పెండ్లిమర్రి, మే 11 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వెయ్యినూతులకోన ఆలయంలో హను మత్‌వాహన సేవలో లక్ష్మీ నృసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదవితరణ చేశారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

వీరపునాయునిపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరమలపల్లె గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం వైభవంగా సాగింది. ఆదివారం గ్రామానికి చెందిన నల్లపురెడ్డిపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక దంపతుల కుమార్తె భారత క్రికెట్ మహిళా జట్టుకు ఎంపికైన సందర్భంగా శ్రీవైష్ణవి చరిత కోరిక మేరకు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు కళ్యాణోత్సవం కమణీయంగా ఉభయదారులుగా నిలిచి అంగరంగవైభంగా జరిపించారు. కల్యాణోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కడప క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గుర్రాలగడ్డ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. గుర్రాలగడ్డకు చెందిన సాదక్‌వల్లి రేషన్‌బియ్యాన్ని ఇతర ప్రాంతానికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సాదక్‌వల్లిని అరెస్టు చేసి 885 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెన్నూరులో 70 బస్తాలు...

చెన్నూరు, మే 11 (ఆంధ్రజ్యోతి):చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలెంపల్లె గ్రామ శివారులో ఎస్ఆర్ఎస్ ట్రేడర్స్‌వద్ద ఉన్న పశుదాణాకేంద్రం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 70 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డేరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

పెండింగ్ కేసులపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, మే 11 (ఆంధ్ర జ్యోతి): వేంపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదై పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐ నరసిం హులు ఎస్ఐలకు సూచించారు. పెండింగ్ కేసులపై ఆదివారం సాయంత్రం సమా వేశం నిర్వహించారు. ఎస్ఐలు తిరుపాల్‌నాయక్, రంగారావుతో చర్చించారు. ఒక్కో కేసు గురించి చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నాలుగురోడ్ల కూడలిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ చర్యలు చేపట్టాలని సీఐ సూచించారు.

పూర్వ విద్యార్థుల సమావేశం అపూర్వం

సీకేదిన్నె, మే 11 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమావేశం ఎంతో అపూర్వంగా జరిగింది. మండలంలోని చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె పంచాయతీలోని సెవెన్త్‌డే అడ్వెంటిస్ స్కూలులో ఆదివారం 2001 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమావేశం ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు చిన్నపిల్లలవలే తరగతి గదులు, ఆటస్థలంలో కలియతిరిగి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఎంతో సంతోషంగా గడిపారు. చదువుచెప్పిన టీచర్లను గౌరవించుకుని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, సుభాషిణి, స్కూల్ సిబ్బంది శ్యాంసన్, ఎలీషా, రాంబాబు, ప్రకాష్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

విషగుళికలు తిని వ్యక్తి మృతి

చెన్నూరు, మే 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎస్టీరామాపురం కాలనీకి చెందిన నక్క ఆదినారాయణ 24 అనే వ్యక్తి తల్లిమందలించిందని పురుగులమందు తాగి మృతి చెందాడు. కూలి పనులకు వెళ్లే ఆదినారాయణ రోజూ మద్యం తాగేవాడు. దీంతో అతని తల్లి సుబ్బమ్మ మందలించగా శనివారం ఇంటినుంచి వెళ్లి పురుగుల మందు తాగగా అతని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జో అచ్యుతానంద... జో జో ముకుందా...
లాలి పరమానంద... రామగోవిందా
అమ్మ పాడే ఈ జోలపాట వింటూ హాయిగా నిద్రపోని బాల్యాన్ని ఊహించగలమా..
చందమామ రావే.. జాబిల్లి రావే..
అమ్మగొంతులోంచి ఈ చల్లని పాట వింటూ గోరుముద్దలు తినని వారెవరైనా తెలుగు నేలమీద ఉంటారా..
ఇటువంటి సంకీర్తన రచనలతో ఆబాలగోపాలాన్ని అలరించిన తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ సందర్భంగా అన్నమయ్యపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


తాళ్లపాక అన్నమయ్య కీర్తిని చాటిచెప్పిన కృష్ణంరాజు స్థూపం

భలే అల్లరోడే.. మహాపండితుడాయె..




- మానవతావాది... బహుముఖ ప్రజ్ఞాశాలి
- నేటి నుంచి తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి ఉత్సవాలు

రాజంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య చిన్నప్పుడు మహా అల్లరి పిల్లవాడు. ఎప్పుడూ ఆటలూ పాటలే. ఇంట్లో ఎవరికీ అది నచ్చేది కాదు. వదిన మందలింపులు ఎక్కువ. ఒకసారి అన్నమయ్యను గడ్డి కోసుకు రమ్మని అడవికి పంపింది. కాదనలేక వదినను తిట్టుకుంటూ అడవికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా చిటికిన వేలు తెగి రక్తం ధారలై కారింది. ఇష్టం లేని చెప్పిందన్న కోపం... గాయం సలుపుతున్న బాధతో కన్నీటి పర్యంతమయ్యాడు. అదే సమయంలో గోవింద నామస్మరణలు ఆ అడవిలో అన్నమయ్యకు వినిపించాయి. తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తబృందాలు ఏడుస్తున్న బాలుడిని ఓదార్చి తెచ్చుకున్న తిండిని అతడికి కొంచెం పెట్టారు. ఇంటిమీద కోపంతో ఉన్న అన్నమయ్య తిరుమలకు బయల్దేరాడు. అదే అతని తిరుమల మొదటి యాత్ర. తన తిరుమల యాత్ర అనుభవాలను అన్నమయ్య అనేక కీర్తనలలో వివరించి చెప్పాడు.

దురాచారాలపై తిరుగుబాటు

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత భావాలు, సమానత్వపు భావాలు కనిపిస్తాయి. శివుడే దైవమని వీరశైవులు, విష్ణువే దేవుడని వీరవైష్ణవులు విషం కక్కుకుంటున్న పరిస్థితుల్లో బ్రహ్మం ఒక్కడే.. పరబ్రహ్మం ఒక్కడే అంటూ ప్రజల భావనల్లో ఏకత్వాన్ని నింపాడు. మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే.. చండాలుండేటి సరిభూమి ఒక్కటే.. అని కులవివక్ష తగదని ప్రబోధించాడు. పురుషులు జీవులే, కొలతులు జీవులే అని కీర్తనల్లో లింగభేదం కేవలం శరీరానికే తప్ప మిగిలిన అన్ని విషయాల్లో ఇరువురూ సమానులేనని చెప్పాడు. వేదాలు పఠించిన వారు గొప్పవారు కాదని, ఆచరించిన వారే ఉన్నతులని పేర్కొన్నాడు. వేలాది సంకీర్తనలు ఏడుకొండల వాడిపై రచించి వేంకటేశ్వరుని మహిమలను, ఏడుకొండల ఔన్నత్యాన్ని, తిరుమల విశేషాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు.


తిరుమలలో భద్రపరిచిన అన్నమయ్య సంకీర్తనలు

హుండీ పెట్టింది అన్నమయ్యే

నేడు వేలకోట్ల రూపాయలు శ్రీవారికి కానుకలు వచ్చే అత్యంత ప్రధాన ఆదాయ వనరు అయిన హుండీని శ్రీవారి ఆలయంలో పెట్టింది అన్నమయ్యే. నిజంగా ఇది అన్నమయ్యకు ఒక గొప్ప కీర్తిని తెచ్చే అంశం.

అన్నమయ్య విగ్రహం ఏర్పాటు

శ్రీ వేంకటేశ్వరస్వామి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్నమాచార్యుల వంశం తాళ్లపాకలో ఒక్క కుటుంబం కూడా లేదు. కేవలం వారి ఇంటి పునాదుల వద్ద అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి జీవనభృతి లేకపోవడంతో ఆ వంశానికి చెందిన 11వ తరానికి చెందిన హరినారాయణాచార్యులు, సత్యనారాయణాచార్యులు తిరుమలకు వెళ్లిపోయి శ్రీవారి మేలుకొల్పు, ఏకాంతసేవలు నిర్వహిస్తున్నారు. వారికి తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే గతంలో ఓ ఇల్లుండగా, మాడవీధుల ఆధునీకరణలో ఆ ఇంటిని కూడా తొలగించారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు ఒక్కరంటే ఒక్కరు కూడా తాళ్ళపాక పరిసర ప్రాంతాలలో లేరు.

తిరుమలలో అన్నమయ్య వంశీయుల ఇల్లు (ఫైల్)


తెలుసుకుందాం..

- అన్నమయ్య కీర్తనలను వెలుగులోకి తెచ్చినది - 19వ శతాబ్దంలో బ్రిటీష్ అధికారి ఎ.డి. క్యాంబెల్
- అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించినది - 1978వ సంవత్సరం
- అన్నమయ్య రాసిన మొత్తం కీర్తనలు - 32,000
- లభ్యమైన కీర్తనలు - 14,351
- తాళ్లపాకను వెలుగులోకి తెచ్చినవారు - కృష్ణంరాజు (1975)
- 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసినది - మే 2008
- 108 అడుగుల విగ్రహాన్ని పూర్తి చేసిన కాలం - 108 రోజులు
- 108 అడుగుల విగ్రహ శిల్పి - దేవరకొండ పెంచలయ్య, సూరిబాబు
- 108అడుగుల విగ్రహ ఏర్పాటుకు వాడిన సామగ్రి - 105 టన్నుల స్టీలు, 15వేల సిమెంటు బస్తాలు, 500 యూనిట్ల ఇసుక, 500 యూనిట్ల మెటల్, 150 మంది శిల్పులు, రూ.3.02కోట్లు ఖర్చు


అన్నమయ్య జన్మస్థలం అలనాటి తాళ్లపాక

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


మృతి చెందిన శ్రీనివాసులు (ఫైల్)

కమలాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు పి.శ్రీనివాసులు(56) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి మృతి

మైదుకూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో పరిధిలో గుత్తి నుంచి కృష్ణపట్నానికి వెళ్లే ఫోర్ లేన్ రహదారి పనులు చేస్తున్న బీహార్‌కు చెందిన వసీమ్(23) అనే యువకుడు ఆదివారం మృతి చెందాడు. మైదుకూరు మీదుగా ఫోర్ లేన్ రహదారి పనులు జరుగుతున్నాయి. ఆ రోడ్డు పనుల్లో భాగంగా ఆదివారం కంకర మిషన్ (ఐజాక్)కు రివర్సు గైడ్‌లెన్స్ ఇస్తున్న వసీమ్ అదుపు తప్పి అదే వాహనం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన శ్రీనివాసులు

రామసముద్రం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్ఐ హిమాచలపతి తెలిపారు. మండలంలోని అరికెల గ్రామ పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాసులు(43) ద్విచక్ర వాహనంలో రామసముద్రం నుంచి వస్తుండగా కేసీపల్లె దగ్గర వాహనం అదుపు తప్పడంతో గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రహదారిలో కారు దగ్ధం



ఒంటిమిట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఆదివారం సాయంత్రం కారు అగ్నికి ఆహుతి అయింది. నంద్యాలకు చెందిన కార్తీక్ కుటుంబ సభ్యులు తిరుపతి నుంచి నంద్యాలకు షిఫ్ట్ కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలోని మండపంపల్లె వద్ద కారు అదుపు తప్పి రోడ్డుపక్కనున్న వంకలోకి వెళ్లింది. వెంటనే కారులో మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్నవారు వెంటనే కారు దిగి బయటకు వచ్చేయడంతో ప్రాణనష్టం జరగలేదు. సంఘటన స్థలం సమీపంలోనే సీఐ బాబు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో అక్కడికి చేరుకుని కార్తీక్ కుటుంబ సభ్యులను మరో వాహనంలో పంపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యాస్ లీక్ - ఇంటిలోని సామాన్లు దగ్ధం



కాలిపోయిన నగదు, ఫ్రిజ్

ఖాజీపేట, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరంఖాన్‌పేటలో ఉన్న కమలాపురం కదిరుల్లా గృహంలో ఆదివారం గ్యాస్ లీక్ కావడంతో ఇంటిలోని సామాన్లు దగ్ధమయ్యాయి. కుటుంబీకుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం అన్నం చేస్తుండగా గ్యాస్ లీక్ కావడాన్ని గమనించిన కదిరుల్లా భార్య బయటకు పరుగెత్తడంతో కొద్దిసేపటికిలో ఇంటిలో మంటలు భారీగా చెలరేగాయి. దాంతో ఇంటిలోని సామాన్లతో పాటు నగదు కూడా కాలిపోయింది. ఇంటిలో పిల్లలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, కాలిపోయిన వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. సమయానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పక్క కుటుంబాలవారు ఊపిరి పీల్చుకున్నారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.3200 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక నాగులయ్యగారిపల్లిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తిప్పేస్వామి తన సిబ్బంతో కలసి దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం


కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలో... గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతు డిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు.

- పెంచలో.. గోవిందా.. మారుమోగిన కోన గిరులు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. క్షేత్రంలో పాత భవనాలు కూల్చివేయడంతోపాటు పలు చోట్ల రహదారుల వెడల్పుచేయడం, ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా చలువ పందిళ్ల వేయడంతో భక్తులు సేద తీరారు. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. మరికొందరు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవలు జరిగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఆకట్టుకున్నాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు ఆదివారం రాత్రి తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన సన్ననిమ్మ, మామిడి, చీనీ చెట్లు
- రూ.20లక్షల నష్టం
- పరిశీలించిన అధికారులు, నాయకులు


నేలవాలిన సన్ననిమ్మ చెట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

చక్రాయపేట, మే 11(ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలంలోని చలేకాంపల్లె, గడ్డంవారిపల్లె రైతులకు సంబంధించి చీనీ, సన్ననిమ్మ, మామిడిచెట్లు శనివారం రాత్రి గాలివానకు నేలకూలాయి. ఫలితంగా రూ.20లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఆ వివరాల్లోకెళితే.. శనివారం రాత్రి భారీ గాలులతో పాటు వర్షం కురిసింది. ఈ గాలివానకు పెద్దూరు, రెడ్డివారిపల్లె, గడ్డంవారిపల్లె, తొట్టికాడపల్లె, గొంది, మేకలవాండ్లపల్లె తదితర గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. చిలేకాంపల్లె గంగులయ్యకు చెందిన 60సన్ననిమ్మ చెట్లు, దేశాయి గంగిరెడ్డి, దేశాయి ఆదినారాయణరెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్, బి.రమణారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, దస్తగిరి, రాజశేఖర్‌రెడ్డి, లోమడ రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి రైతులకు చెందిన దాదాపు 400 చెట్లు నేలకొరిగినట్లు సమాచారం. గాలివానకు పడిపోయిన చెట్లను వ్యవసాయ అధికారి ముబారక్‌తో పాటు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, చక్రాయపేట మండల ఇన్ చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి పార్టీలకతీతంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

నారాపురం వేంకటేశ్వరుడికి ధ్వజారోహణం


ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ పూజలు చేస్తున్న పండితులు

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాను ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పండితులు, అధికారులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం అలంకరణ మండపంలో ఊంజల్ సేవ, అన్నమాచార్య కీర్తనలు, పెద్దశేష వాహనం, మెరువణి జరిగింది. హరికథ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



కడప క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత దృష్ట్యా డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఎస్పీ పర్యవేక్షణలో రైల్వేస్టేషన్లు, బస్టాం డ్లు తదితర ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీ లు నిర్వహించారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో, చెక్‌పోస్టుల్లో ఆయా పోలీసు లతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేశారు. జిల్లా అంతటా అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీ లు కొనసాగించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రెడ్డి, కమ్మ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

కడప మారుతీనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని పాలించిన రెడ్డి, కమ్మ పార్టీల నాయకుల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వనాశనమైందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ధ్వజమెత్తారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇంజనీర్స్ భవన్‌లో బహుజన సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను ఎలా దోచుకోవాలా... దాచుకోవాలనే తప్ప ప్రజల జీవన స్థితిగతులను మార్చాలనే ధ్యాసే ఆ రెండు వర్గాల నాయకులకు లేదన్నారు. నాటి నుండి నేటి వరకూ ఆ రెండు కులాల ప్రజలే అన్ని రంగాలలో అభివృద్ధి చెందారు తప్ప అణగారిన ప్రజలు నేటికీ బానిసలుగా అన్ని రంగాలలో వెనుకబడి వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంథా పోవాలంటే అణగారిన వర్గాలన్నీ ఒక్క తాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆర్.జె. మల్లికల్, జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, జిల్లా ఇన్‌చార్జ్ ఓబయ్య, మహిళా అధ్యక్షురాలు బేబి, నాయకులు చంద్ర, జయరామ్, జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కట్టా దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, మే 11(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో కట్టా దొరస్వామినాయుడుతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు 50 కేజీల కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం కేజీఎస్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, వక్ఫ్ బోర్డు మెంబర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, విజయభారతి స్కూల్ కరెస్పాండెంట్ సేతు, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ముత్తకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంత్యుత్సవాలు


కొండాపురంలో నరసింహ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి


గోపవరంలో అలంకరణలో నరసింహస్వామి


బి.కోడూరులోని నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొండాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి) లక్ష్మీనరసింహస్వామి వారి జయంత్యుత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఇప్పటికే పలుచోట్ల మూడు రోజుల నుంచే ఆయా ఆలయాల నిర్వాహకులు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. కొండాపురం మండలంలోని పొట్టిపాడు గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ దేవగుడినారాయణరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు చింతారామచంద్రారెడ్డి , శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మండలంలోని ఉప్పుగుంటపల్లెలో ప్రాచీనకాలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జయంత్యుత్సవాలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. .ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొని ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. క్రిష్ణ కిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం, కోలాటం, చెక్కభజన కార్యక్రమాలు జరిగాయి.

గోపవరంలో: గోపవరం మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు పూలమాలలతో స్వామివారిని అలంకరించారు. అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు కన్నులపండువగా దర్శించుకున్నారు. ఉదయం 7.30 నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 13 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నల్లగొండ నరసింహస్వామి తిరునాళ్లు

బి.కోడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎర్రి ఓబన్నబావి సమీపాన కొండ దడిన వెలసియున్న పురాతన నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్కడికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని విజయనగర కాలనీ (సిరిగిరిపల్లె) గ్రామంలో నరసింహస్వామి జయంతి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు రాజా యోగి ఓబయ్య, గుర్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

బద్వేలుటౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైదుకూరురోడ్ కుమ్మరికొట్టాలలో వెలసి ఉన్న సీతారామస్వామి ఆలయంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా కమనీయంగా నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ వారు భక్తాదులకు తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ చేపట్టారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవంలో కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది.

కాశినాయనలో: మండలంలోని పిట్టిగుంట గ్రామంలో ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. రాములవారి గ్రామోత్సవంలో ప్రదర్శించిన కేరళా డ్రమ్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం పెద్దఎత్తున్న అన్నదానం ఏర్పాటుచేశారు.

వీరాంజనేయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మైదుకూరు రూరల్ ,మే 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ పరిధిలోని పాతపలెంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో తెల్లవారుజాము నుంచే గణపతి హోమం, పంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు .సోమవారం మంగళవారంలలో ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమంతో పాటు బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకు లు తెలిపారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో వీరాంజనేయస్వామి తిరుణాళ్లను నిర్వహించనున్నారు. సుంకేసుల గ్రామస్థులు కలిసికట్టుగా బండలాగుడు పోటీలు, రెండెద్దుల పరుగుపందెం, అన్నదానం చేస్తారు. రాష్ట్రస్థాయి న్యూ కేటగిరి వృషభరాజముల బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30, మూడో బహుమతి రూ.15, రెండెద్దుల పరుగు పందెంలో మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.6,500, మూడవ బహుమతి రూ.6 వేలు, 4వ బహుమతి రూ.5వేలు ఆలయ కమిటీ అందజేయనున్నారు.


బద్వేలులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ

బి.కోడూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : బి.కోడూరు మండలానికి కొత్త ఎస్‌ఐ వెంకటసురేశ్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు, శేషారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బసిరెడ్డి రామక్రిష్ణరెడ్డి, పొట్టి సుబ్బారెడ్డి, దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, ఏసురత్నం, పెద్దన్న, నరసయ్య, సుబ్బయ్యలు ఎస్‌ఐని సత్కరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కలసపాడు,మే 11 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం మామిళ్లపల్లెకు చెందిన సూర్యనారాయణరెడ్డి (38) అనే వ్యక్తి అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. ఏసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఇతను గత నెల 25న ఇంటి నుంచి వెళ్లి ఇంత వరకు కనిపించలేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలలిపారు.

సీసీ రోడ్డు ప్రారంభం

దువ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. ఇక్కడ రూ.20 లక్షలతో రోడ్డు నిర్మించారు. మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని పొట్టిపాడు రోడ్డులో నిర్వహించిన న్యూక్యాటగిరి బండలా గుడు పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ప్రారంభించారు. ఆదివారం స్థానిక మస్తానమ్మ కుంట ఏసీ గోడౌన్‌ల సమీపంలో వృషభరాజము సంస్మరణ సంద ర్భంగా పొట్టు లక్ష్మిరెడ్డి ఆద్వర్యంలో చేపట్టిన పోటీలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, బచ్చలప్రతాప్, శ్రీనివాసులరెడ్డి, ఓబుళరెడ్డి, అజీమ్, సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ప్రొద్దుటూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు పాఠశాలకు చెందిన 1999 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు తరలివచ్చారు. వారు చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సరస్వతి, వెంకటేశ్వర్లురెడ్డి, నారప్పరెడ్డి, జయరామిరెడ్డి, సాదక్‌హుస్సేన్, రమణ, సుబ్బరాయుడులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, రాజేష్, వరప్రసాద్, వెంకటసుబ్బయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం


ఇంటర్ పూర్వ విద్యార్థులు

మైదుకూరు రూరల్ ,మే 11 (ఆంధ్రజ్యోతి) : స్నేహమేరా జీవితం...స్నేహమేరా శాశ్వతం అంటూ పూర్వ ఇంటర్ విద్యార్థుల స్నేహం గురించి వివరించారు. స్థానిక ఆర్‌ఈఎస్ జూనియర్ కళాశాలలో 1990-1992లో ఇంటర్ చదువుకొన్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు ఆలింగనం చేసుకొంటు ప్రస్తుతం వారి పని చేస్తున్న వ్యాపారాలు, ఉద్యోగాల గురించి పరిచయాలు చేసుకొన్నారు. పాఠాలు చెప్పిన లెక్చరర్లకు కృతజ్ఞతగా శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానాలు చేశారు. మైదుకూరులోనే తొలిసారిగా ఇంటర్ విద్యార్థుల సమ్మేళనం జరగడం ఇదే మొదటిదని కొనియాడారు. తోటి స్నేహితురాల భర్త చనిపోవడంతో వారి కుటుంబానికి చేయూతగా మిత్రులందరూ కలిసి 25 వేల రూపాయల ఆర్థికసాయం చేశారు.

ప్రమాదమని తెలిసినా..పట్టించుకోరా..?


నడిరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు శ్రీ నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా తేరురోడ్డుకు వెళ్లే దారి నడి రోడ్డులో విద్యుత్తు ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు భానుప్రకాష్‌రెడ్డి, ఆలయాన్ని సందర్శించినప్పుడు విద్యుత్ అధికారులు హాజరయ్యారా అంటూ ఎమ్మెల్యే ఆలయ పండితులతో, అధికారులతో ఆరా తీశారు. ఆదివారం కూటమి నాయకుడు గోనా పురుషోత్తంరెడ్డి రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌పార్మర్ ఉందని ప్రమాదం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు విద్యుత్ శాఖ ఏడీ రాజగోపాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆలయం ఎదురుగా నడి రోడ్డుపై తేరు రోడ్డుకు ట్రాన్స్‌పార్మర్ ఉందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరగా తొలగిస్తామని ఆయన తెలిపారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలసపాడు, మే 11(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలసపాడు ఎస్‌ఐ తిమోతి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల ఆలయ నిర్వాహకులు, ప్రజలలో స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ప్రార్థనా మందిరాల్లో సీసీకెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, లోన్ యాప్స్, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు వాటికి పడే శిక్ష, ట్రాఫిక్ రూల్స్ తదితరఅంశాలపై ప్రజలకు వివరించారు. పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మైదుకూరులో ఘనంగా గంగమ్మ జాతర


గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ ,మే 11(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మండలంలోని శివపురం ఎస్టీ కాలనీలోని గంగమ్మ దేవాలయంలో గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరై గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మిల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో ఘనంగా పెద్దమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

మైలవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యవారిపల్లెలో పెద్దమ్మ అమ్మవారి జాతర ఆదివారం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారిని కూర్చోబెట్టి పూజలు మొదలు పెట్టారు. పెద్దమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే కాక చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. జాతర సందర్భంగా అమ్మవారిని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పోలేరమ్మ ఆలయంలో రితేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు రితీష్‌రెడ్డి ఇతర నేతలు

కాశినాయున మే11(ఆంధ్ర జ్యోతి మండలంలోని పిట్టిగుంటలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయాన్ని ఆదివారం బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆయన వెంట బద్వేల్ బీజేపీ నాయకుడు జొజ్జారోశన్న అమ్మవారిని సందర్శించి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకుడు బి.రవీంద్రారెడ్డి, బి.రాజ శేఖర్‌రెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, బి.జయరామిరెడ్డి, బి.నరసింహారెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, శ్రీనివా సులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం

బద్వేలు, మే 11 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యా సంఘాలతో విద్యాశాఖాధికారులు చర్చించినా పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నరని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12 జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. 2021 తర్వాత రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని లేని పక్షంలో మే 15వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో విజయవాడలోని విద్యాభవన్‌ను ముట్టడించడం జరుగుతుందని ఆదివారం విడుదల చేసినా పత్రికా ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని మైనార్టీ లబ్ధిదారులకు రాయితీ రుణాలకు ఈ నెల 25వతేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. రుణాలు 4 శ్లాబ్‌లో ఇవ్వడం జరుగుతుఉందన్నారు. ఆన్‌లైను ద్వారా అర్హులైన మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని గ్రామీణ ప్రాంతల్లో లక్షా 50వేలు వార్షికాదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. 33.3 శాతం మహిళలకు కేటాయిస్తారన్నారు.

2003 ఉపాధ్యాయులకు పాత శిక్షణ అమలు చేయాలి


మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత శిక్షణ విదానం అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానం అమలు కావడంలేదనే సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబరు నాటికి ఉద్యోగాలకు ఎంపికైన వారందరికి పాత పెన్షన్ పథకం వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీ చేసిందన్నారు. దీని వలన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు సీపీఎస్ పరిధిలోకి వచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో మేరకు వారికి పాత పెన్షన్ పథకం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఉదయభాస్కర్, వీరప్రతాప్, సుధాకర్, చాంద్‌బాష, వాసవీ, రామిరెడ్డి, ఇక్బాల్, పుల్లయ్య, రమణయ్య, క్రిష్టయ్య పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు


అమ్మవారికి పూజ చేస్తున్న బీజేపీ నేతలు

ముద్దనూరు మే11(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌ను మట్టికరిపించాలని,ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని బీజేపీ నాయకులు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయాల్లో పూజలు చేశారు.చెన్నారెడ్డిపల్లె గ్రామంలోని పెద్దమ్మ తల్లి, మారెమ్మతల్లికి భారత సైనికులకు మనోధైర్యాన్ని కలిగించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, నాగరాజు, వెంకటాద్రి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వీరజవాన్ మురళీనాయక్

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ వీరజవాన్ మురళీ నాయక్ అని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా గోరంట్ల మండలం వీరజవాన్ స్వగ్రామం అయిన కల్లేతాండాలో చేరుకుని ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛంతో భూపేశ్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పూర్వపు బొమ్మేపల్లెలో శనివారం సాయంత్రం ఘర్షణలో గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాజచౌడయ్య (35) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతదేహాన్ని రాత్రి జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇంటి ముందు పేడనీళ్లు చల్లే విషయంలో శనివారం రాత్రి గొడవ జరిగింది. ఈ ఘటనలో 13 మంది గాయపడ్డారు. అందులో ఇద్దరిని ప్రొద్దుటూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అలాగే మరో వ్యక్తి రాజచౌడయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు.

ఉరుసులో అలరించిన ఖవ్వాలి

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో పలగాడి సెంటర్‌లో హజరత్ సయ్యద్‌షా బడేగౌస్‌పీరాఖాద్రి (పెద్ద ఆస్తానములవారి తూగుట్లపల్లె జాగీర్దార్) 93వ ఉరుసు మహోత్సవంలో జరిగిన ఖవ్వాలి పోటీ ఆహుతులను అలరించింది. అనంతరం దర్గాలో భక్తులు ప్రత్యేక పాతెహాలు నిర్వహించి మొక్కుకున్నారు. ఆదివారం రాత్రి దర్గాలో బడేబదురుద్దీన్ సాహెబ్ గంధం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.